వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 210 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/-






## ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర

- ఎన్నిసార్లు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

సిద్దిపేట,

దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నారు? ప్రజల డబ్బులు ఎందుకు వృధా చేస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఏ హరీష్ రావు ప్రశ్నించారు. ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలి? దరఖాస్తు పెట్టిన -మిగతా 3 లో

- ప్రపంచస్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి
- ఫ్యూచర్ సిటీలో అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థ
- జీహెచ్ఎంసీ పరిధిలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు
- తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు డ్రై పోర్టు
- దావోస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పెట్టుబడులను ఆహ్వానించిన రేవంత్




# రవాణా రంగంలో పెట్టుబడుల వేట



దావోస్,

రవాణారంగంలో పెట్టుబడులకు ముందుకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం, సీఐఐ, హీరో మోటార్ కార్ప్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. శరవేగంగా -మిగతా 3 లో





## నేటితో బేటీ బచావో, బేటీ పడావోకు పదేళ్లు

- ట్విటర్ వేదికగా భావోద్వేగానికి లోనైన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,

ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'బేటీ బచావో, బేటీ పఢావో' కార్యక్రమం నేటితో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. 'నేటితో బేటీ బచావో, బేటీ పఢావో ఉద్యమానికి పదేళ్లు పూర్తవుతాయి. గత దశాబ్ద కాలంలో -మిగతా 3 లో



## కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

- కొన్ని చిత్రాలను విడుదల చేసిన నాసా

లక్నో,

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. 45 రోజులపాటు సాగే ఈ మహాకుంభ మేళాలో భాగంగా త్రివేణీ సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల కోసం యూపీ సర్కార్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం ప్రత్యేక టెంట్లు వంటి నిర్మాణాలు చేపట్టింది. దీంతో మహాకుంభ్ మొత్తం ఓ -మిగతా 3 లో

# సోయిలేని కాంగ్రెస్ పాలన



- రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకే రక్షణ లేదు
- కాంగ్రెస్ గూండాలు హద్దులు దాటుతున్నారు
- దాడి చేసిన వారిపై కాకుండా బాధితులపై కేసులా
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

హైదరాబాద్,

రాష్ట్రంలో ప్రజాప్రతినిధులకు కూడా రక్షణ లేకుండాపోతుందని, కాంగ్రెస్ గూండాలు హద్దులు దాటుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో దివ్యాంగుడైన ఒక మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదని.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి దుండగులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. బీఆర్ఎస్‌కు భయపడి నల్గొండ రైతు మహాధర్నాకు అనుమతి ఇవ్వలేదని.. ఫ్లెక్సీలు చింపి, ఏకంగా ఓ ప్రభుత్వ -మిగతా 3 లో



## అర్హులందరికీ రేషన్ కార్డు ఇందిరమ్మ ఇల్లు

- దరఖాస్తు చేసుకుంటే మంజూరు ఇస్తాం
- విపక్షాల రెచ్చగొట్టే ప్రయత్నాలను నమ్మొద్దు
- కరీంనగర్ జిల్లాలో మంత్రుల హామీ

కరీంనగర్,

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. పేదలందరికీ కార్డులు -మిగతా 3 లో




## బీజేపీని ఇరుకున పెట్టేందుకు ప్లాన్

- ఏడు పాయింట్లతో ఆప్ మేనిఫెస్టో

న్యూఢిల్లీ,

ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడుతున్నాయి. ఈసారి అధికార ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంటోంది. పేద, మధ్య తరగతి ప్రజలను తమ వైపునకు తిప్పుకునేలా ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల -మిగతా 3 లో

## తెలంగాణలో కొనసాగుతున్న పెట్టుబడుల వేట

- రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు
- ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా
- తెలంగాణ వృద్ధిలో ఈ డేటా సెంటర్ మరో మైలురాయి : ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు


హైదరాబాద్,

తెలంగాణ ప్రభుత్వం దావోస్‌లో పెట్టుబడుల వేట కొనసాగిస్తోంది. ఇదివరకే యూనిలీవర్, హెచ్‌సీఎల్ లాంటి దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది. తాజాగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా రూ.10 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూపై -మిగతా 3 లో



# ఏపీలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల తేదీలు విడుదల

## మే 3 నుంచి 9వ తేదీ వరకు పరీక్షలు




అమరావతి,
ఏపీలో గ్రూప్-1 ఉద్యోగాల నియామకం కోసం మెయిన్స్ పరీక్షల తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. మే 3 నుంచి 9వ తేదీ వరకు ఎగ్జామ్స్ నిర్వహించనుంది. ప్రిలిమ్స్‌లో 4,496 మంది అభ్యర్థులు అర్హత సాధించగా వారిలో 1:50 చొప్పున అభ్యర్థులను మెయిన్స్‌కి ఎంపిక చేసింది. 2023 డిసెంబర్?లో అప్పటి వైసీపీ ప్రభుత్వం 89 గ్రూప్?-1 ఉద్యోగాల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. 2024 మార్చి 17న ప్రిలిమ్స్ ఎగ్జామ్స్‌ను నిర్వహించింది. వైసీపీ సర్కార్ ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రిలిమ్స్ నిర్వహించడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయామని, మెయిన్స్ పరీక్ష రాసేందుకు తగిన గడువును ఇవ్వాలని కమిషన్‌ను పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అమలాపురంలో మెయిన్స్ పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ పరీక్షలను డిస్క్రిప్టివ్ టైప్?లో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ఇన్‌చార్జి కార్యదర్శి ఐ . నరసింహమూర్తి తెలిపారు. మెయిన్స్ ప్రశ్నాపత్రాన్ని ట్యాబ్‌లలో పొందుపరచి ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

# కాళేశ్వరంపై కొనసాగిన విచారణ

## హాజరైన జలవనరుల అభివృద్ధి మాజీ చైర్మన్ ప్రకాశ్



హైదరాబాద్,
-ాళేశ్వరం కమిషన్ విచారణ కొనసాగుతోంది. దీనిలో భాగంగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ వి.ప్రకాశ్‌ను కమిషన్ ప్రశ్నించింది. కమిషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అఫిడవిట్ సమర్పించినట్లు వి.ప్రకాశ్ తెలిపారు. ఎవరి మద్దతూ అవసరం లేదని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ఆయనకు బదులిచ్చారు. రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా పని చేస్తామని చెప్పారు. తమ ముందు ఎవరూ రాజకీయ ఉపన్యాసాలు చేయవద్దన్నారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేక కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినట్లు ప్రకాశ్ తెలిపారు. స్థిరీకరణకూ ఎక్కువ నీరు అవసరం కాబట్టి చేపట్టారన్నారు. మేడిగడ్డ వద్ద ఆనకట్ట వద్దని ఇంజినీర్ల కమిటీ చెప్పింది కదా అని కమిషన్ ప్రశ్నించింది. విశ్రాంత ఇంజినీర్ల కమిటీ అలా చెప్పలేదని ప్రకాశ్ పేర్కొన్నారు. బొగ్గు గనుల వద్ద సొరంగాలు వద్దన్న సిఫారసును ప్రభుత్వం గౌరవించిందని చెప్పారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకునే కాళేశ్వరం నిర్మించారన్నారు.

# కేరళలో భారీగా స్పిరిట్ స్వాధీనం

## ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



తిరువనంతపురం,
కేరళ మలప్పురంలోని కోలప్పురంలో భారీగా స్పిరిట్ పట్టుకున్నారు. 20,000 లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పాలక్కాడ్ జిల్లా పోలీసు చీఫ్ డ్యాన్స్ స్క్వాడ్, తిరురంగడి పోలీసులు సంయుక్తంగా స్పిరిట్‌ను అరెస్టు చేసినట్లు సమాచారం. కర్ణాటక నుండి ఎర్నాకుళం వరకు స్పిరిట్‌ను అదుపులోకి తీసుకున్నారు. పాలక్కాడ్ నుండి ఒక పోలీసు బృందం లారీని వెంబడించి, స్పిరిట్‌ను కోలప్పురం వద్ద స్వాధీనం చేసుకున్నారు. స్పిరిట్‌ను డబ్బాల్లో తరలిస్తున్నారు. స్పిరిట్ పై చెత్త సంచులు, టార్పాలిన్‌తో కప్పబడి ఉంది. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులోని మీనాక్షిపురంకు చెందిన మోయితీన్, పొల్లాచ్చికి చెందిన అన్నళకన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# ట్రంప్ చర్యలపై భారత్ నిశిత పరిశీలన

## -ఆచితూచి వ్యవహరిస్తున్న మోడీ సర్కార్



హైదరాబాద్,
అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్‌లో నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన అక్రమ వలసదారులపై కఠిన వైఖరిని అవలంబిస్తున్నారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అధిక పన్ను విధిస్తున్నారు. తద్వారా వలసలను తగ్గించొచ్చని అధ్యక్షుడు భావిస్తున్నారు. నేపథ్యంలో ట్రంప్ చర్యలతో భారత్ ఆచుతూచి నిర్ణయాలు తీసుకుంటోంది. అగ్రరాజ్యంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తోన్న దౌత్య, ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించింది. వాటిపై ఎలాంటి దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడుతోంది. ట్రంప్ పాలనకు సహకరించేలా నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న తమ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత్ యోచిస్తున్నట్లు సమాచారం. సరైన పత్రాలు లేకుండా దాదాపు 18,000 మంది భారతీయులు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. అయితే, వాస్తవానికి ఆ సంఖ్య మరింత ఎక్కువ కూడా ఉండొచ్చని అంచనా. తాజాగా కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వాళ్లందరినీ వెనక్కి పిలిపించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. దీనికోసం ఓ సమగ్ర ప్రణాళికను రూపొందించబోతోందని పేర్కొన్నారు. కాగా, ఎన్నికల ప్రచారంలో అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులను ర్యాడికల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించారు. అలాంటి వాళ్లు అమెరికా గడ్డపై నివసించేందుకు ఏమాత్రం అర్హులు కాదని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జన్మతః పౌరసత్వ హక్కును కూడా రద్దు చేశారు. అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. ఇక ట్రంప్ చర్యల నేపథ్యంలో అప్రమత్తమైన భారత ప్రభుత్వం భారతీయులను తిరిగి వెనక్కి రప్పించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

# రేషన్‌కార్డుదారులకు మరో శుభవార్త

## -త్వరలో రేషన్‌షాపుల్లోనే కొడిగుడ్ల పంపిణీ



హైదరాబాద్
తెలంగాణలోని రేషన్ కార్డు దారులకు మరో కొత్త శుభవార్త వినిపించనుంది. కోడిగుడ్డులోని పోషక విలువలను దృష్టిలో ఉంచుకొని రేషన్ షాపుల్లో గుడ్లు కూడా పంపిణీ చేయాలని నేషనల్ ఎగ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ (ఎన్‌ఈసీపీసీ) తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. సాధారణంగా రేషన్ షాపుల్లో పప్పులు, బియ్యం, నూనెలు వంటి నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తుంటారు. అయితే గుడ్డులోని పోషకాల దృష్ట్యా రేషన్ ద్వారా వీటిని కూడా సప్లై చేయాలని ఎన్‌ఈసీపీసీ చెబుతోంది. ఈ క్రమంలో గుడ్డు ప్రాధాన్యతను, అందులోని పోషక విలువలను వివరిస్తూ కౌన్సిల్ రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ బాలస్వామి, పౌల్ట్రీ ఇండియా వ్యవస్థాపకుడు పొట్లూరి చక్రధర్‌రావు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి 6 గుడ్లు, అంగన్‌వాడీల్లో గర్భిణులకు రోజుకు 2 గుడ్లు, పనికి ఆహార పథకంలో పనిచేస్తున్న వారికి నెలకు 30 గుడ్లు ఇస్తున్నట్లు గుర్తు చేశారు. ఎన్ని గుడ్లు తిన్నా ఆరోగ్య సమస్యలు రావని, గుడ్డు సంపూర్ణ పౌష్టికాహారమని, కొలెస్ట్రాల్?పెరుగుతుందన్న అపోహను వీడాలన్నారు.?రేషన్ కార్డు ద్వారా ప్రజలకు కూడా నెలకు కనీసం 30 గుడ్లు అందిస్తే సామాన్య, మధ్య తరగతి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ఉంటారని చెప్పుకొచ్చారు. తగిన పోషకాలు వారికి అందుతాయని వివరించారు. ఈక్విప్ మ్యాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయసింగ్, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ జోనల్ ఛైర్మన్ ఎశేఖర్‌రెడ్డితోపాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక ఎన్‌ఈసీపీసీ తాజా ప్రతిపాదనపై రేవంత్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్కూళ్లు, అంగన్‌వాడీల్లో విద్యార్థులకు, గర్భిణులకు ప్రభుత్వం ఉచితంగా గుడ్లు అందిస్తుంది. ఒక వేళ సర్కార్ ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందిస్తే రేషన్ కార్డు దారులకు కూడా ఉచితంగా ఇస్తారా? లేదా సబ్సిడీతో పంపిణీ చేస్తారా? అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

# ఆర్జీకర్ కేసులో అందరి వాదనలు వింటాం

## బెంగాల్ సర్కార్ పిటిషన్‌పై సిల్డా కోర్టు వెల్లడి
## కేసును సోమవారానికి వాయిదా



కోల్‌కతా,
ఆర్జీకర్ ఘటనలో దోషి సంజయ్‌రాయ్‌కు మరణశిక్ష విధించాలంటూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించిన క్రమంలో.. అందరి వాదనలు విన్న తర్వాతే ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిగణలోకి తీసుకుంటామని న్యాయస్థానం తెలిపింది. దోషి సంజయ్ రాయ్, సీబీఐ, మృతురాలి కుటుంబ సభ్యుల వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్‌ను స్వీకరిస్తామని స్పష్టం చేసింది. ఈ కేసుపై సోమవారం విచారణ జరుపుతామని తెలిపింది.కాగా, ఈ కేసులో నిందితుడికి సియాల్దా కోర్టు విధించిన శిక్ష సరిపోదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయడాన్ని సీబీఐ వ్యతిరేకించింది. కేసును విచారించిన సంస్థగా శిక్ష విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు తమకు మాత్రమే ఉందని.. ఇందులో జోక్యం చేసుకొనే అధికారం ప్రభుత్వానికి లేదని పేర్కొంది. గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన కేసుపై ఇటీవల విచారణ జరిపిన కోల్‌కతాలోని సియాల్దా కోర్టు నిందితుడు సంజయ్‌రాయ్‌కు జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని వివరించింది. దీనిపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ.. ఈ తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోషికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బెంగాల్ సర్కారు మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది.

# యూజర్లకు ఎయిర్‌టెల్ షాక్

## రీఛార్జ్ ప్లాన్‌ల నుంచి డేటా తొలగింపు

న్యూఢిల్లీ,
ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ యూజర్లకు షాకిచ్చింది. ఇప్పటికే అందిస్తున్న రెండు రీఛార్జి ఎ÷-లాన్లపై ఇచ్చే డేటాను తొలగించింది. వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా రీఛార్జి ప్లాన్లు తీసుకురావాలని టెలికాం కంపెనీలకు ట్రాయ్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌టెల్ రూ.509 ఎ÷-లాన్ 84 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఈ రీఛార్జితో అన్‌లిమిటెడ్ వాయిస్‌కాల్స్, 900 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఇక రూ.1,999 రీఛార్జి ప్లాన్‌తో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 3600 ఎస్సెమ్మెస్‌లు లభిస్తాయి. ఈ ప్లాన్ 365 రోజుల వ్యాలిడిటీతో వస్తోంది. ఈ రెండు రీఛార్జి ప్లాన్లపై ఇంతకు ముందు డేటా కూడా అందించేది. తాజాగా ఆ సదుపాయాన్ని తొలగించింది. త్వరలోనే జియో కూడా అదే బాటలో పయనించే అవకాశం ఉందని తెలుస్తోంది. అది అందిస్తున్న రూ.479, రూ.1999 ఎ÷-లాన్లపై డేటా తొలగించే అవకాశం ఉందని ఓ టిప్‌స్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దాదాపు అన్ని టెలికాం కంపెనీలు వాయిస్, ఎస్సెమ్మెస్‌తో పాటు డేటా కలగలిపిన ఎ÷-లాన్‌లు అందిస్తున్నాయి. ఇంటర్నెట్ అవసరం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో రీఛార్జి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వాయిస్, ఎస్సెమ్మెస్‌ల కోసం ప్రత్యేకంగా రీఛార్జి ఎ÷-లాన్లు తీసుకురావాలని ఆయా కంపెనీలను టెలికాం నియంత్రణ సంస్థ (ట్రాయ్) తాజాగా ఆదేశించింది. స్పెషల్ టారిఫ్ వోచర్లు తీసుకురావాలంటూ సూచించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌టెల్ తన రెండు రీఛార్జి ఎ÷-లాన్లలో డేటాను తొలగించింది. త్వరలో జియో కూడా ఇదే బాటలో పయనించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# రవాణా రంగంలో పెట్టుబడుల వేట

(మొదటి తరువాయి)

అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలన్నారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజలు తక్కువ ఖర్చుతో.. వేగంగా ప్రయాణించాలనేది ప్రభుత్వ ఆకాంక్ష అని వివరించిన సీఎం.. అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యుత్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు రద్దు చేసినట్లు వివరించారు. దేశంలో అత్యధిక ఈవీ వాహనాల విక్రయాలు తెలంగాణలోనే జరుగుతున్నాయన్నారు. మొబిలిటీతో పాటు.. పర్యావరణ అనుకూల వ్యవస్థలు అవసరమని, అందుకే జీహెచ్ఎంసీ పరిధిలో 3వేల ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో డ్రైపోర్టును నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దు తున్నామన్నారు. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చేందుకు డ్రై పోర్టుకు సమీపంగా ఉండే ఏపీలోని మచిలీపట్నం పోర్టుకు ప్రత్యేకంగా రోడ్డు, రైలు మార్గాలతో అనుసంధానం చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. నగరాల అభివృద్ధికి, భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ పునాది వంటిదన్నారు. తక్కువ ఖర్చు, వేగంగా చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయని సీఎం అన్నారు. కోటీ 20 లక్షలకు పైగా జనాభా ఉన్న హైదరాబాద్ లో దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని అందరినీ ఆహ్వానిస్తున్నాం. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది మా ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుంది. తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. పర్యావరణహితంగా హైదరాబాద్ ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేది మా అభిమతం. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశాలు హైదరాబాద్లో ఉండాలని కోరుకుంటున్నాం. ఎలక్టిక్ వెహికిల్స్ పై మేము ప్రత్యేక దృష్టిని సారించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశాం. భారత దేశంలోనే ఈవీ వాహనాలు అత్యధికంగా అమ్ముడు పోయే రాష్ట్రం తెలంగాణ అన్నారు. మొబిలిటీ ఒక్కటే అన్నింటికీ పరిష్కారం కాదు. ఇప్పుడున్న పరిస్థితులను పర్యావరణ అనుకూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. అందుకే గ్రేటర్ హైదరాబాద్ సిటీలో ప్రజా రవాణా వ్యవస్థలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నాం. తెలంగాణ డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌజ్ హబ్ గా తీర్చిదిద్దుతున్నాం. తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తాం. నగరాల అభివృద్ధికి, వాటి భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ భవిష్యత్తుకు పునాది. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయి. హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉంది. దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నాం. ఇప్పుడున్న దానికంటే ఇది రెండింతలు ఎక్కువ. నేను నా బృందంతో కలిసి జ్యూరిచ్ నుంచి దావోస్ కు రైలులో ప్రయాణించాం. అదొక అందమైన అనుభూతిని కలిగించే ప్రయాణం. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ మేరకు ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నాం. ఆ రెండు రింగ్ రోడ్లను కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మిస్తాం. రింగ్ రోడ్లకు అనుబంధంగా రింగ్ రైల్వే లైను నిర్మించాలనే ఆలోచనలున్నాయి. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అర్బన్ మొబిలిటీపై నా అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఇచ్చినందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ కు కృతజ్ఞతలు అని అన్నారు.

# ఇంకెన్నాళ్లు ఇలా దరఖాస్తుల జాతర

(మొదటి తరువాయి)

ప్రతిసారి 30, 40 రూపాయలు ఖర్చు అవుతుందని, ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టాం, మీ సేవలో అప్లికేషన్ పెట్టాం, ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నామని ప్రజలు అంటున్నారని, ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్ లైన్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆన్ లైన్ దరఖాస్తులు కట్టగట్టి పక్కకు పడేయడం వల్ల మళ్ళీ మళ్ళీ దరఖాస్తులు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. సిద్దిపేట పట్టణం గాడిచర్లపల్లి 15వ వార్డ్ లో నిర్వహించిన గ్రామ సభలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నిర్బంధాల మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారని, ఎలక్షన్ల ముందు అందరికీ పరమాన్నం పెడుతామన్నారని, ఇప్పుడు అందరికీ పంగనామాలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని హరీష్ రావు నిలదీశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వాన్ని చీమ కుట్టినట్లయినా లేకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎగవేతల సిఎం రేవంత్ రెడ్డి, కోతల రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కోతలు ఎన్నికల తర్వాత ఎగవేతలు అని చురకలంటించారు. రేవంత్ రెడ్డికి నిజాయితీ ఉంటే, చిత్తశుద్ధి ఉంటే యాసంగి వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి ఐదు లక్షల ఇల్లు కడతామని హామీ ఇచ్చారని, ఏడాది పూర్తయిందని ఒక్క ఇల్లయిన ప్రభుత్వం కట్టిందా? అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇల్లులే తప్ప కట్టిన ఇళ్ళు లేవని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సి, ఎస్టిలకు ఇల్లు కట్టుకునేందుకు ఆరు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కోటిమంది కూలీలు ఉంటే కోతలు పెట్టి ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వడం సరికాదన్నారు. ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల రూపాయలు బాకీ పడిందని, 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. రేవంత్ రెడ్డి అవ్వాతాతలకు 4000 పెన్షన్ ఎప్పుడు ఇస్తావని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా వానకాలం, యాసంగికి కలిపి 15వేల రూపాయలు ఇవ్వాలని కోరుతున్నామని, వ్యవసాయ కూలీలందరికీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డు
# ఇందిరమ్మ ఇల్లు

(మొదటి తరువాయి)

ఇస్తామని, ప్రతిపక్షాలు ఆరోపించినట్లు ఎవ్వరూ భయపడొద్దని మంత్రి చెప్పారు. వివిధ గ్రామసభల్లో మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్‌లు పాల్గొని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు గ్రామసభలో ఉత్తమ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తులు అన్నీ పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈరోజు దరఖాస్తు ఇచ్చినా రేషన్ కార్డు ఇస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాగా, తెలంగాణ వ్యాప్తంగా జనవరి 21 నుంచి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈనెల 24 వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. కాగా, ఈనెల 26న నుంచి అర్హులకు రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయనుంది. గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం కులగణన సర్వే చేసింది. ఈ సర్వేలో చాలామంది తమకు రేషన్ కార్డులు లేవని ఎన్యూమరేటర్ల కు తెలిపారు. ఈ విషయాన్ని ఎన్యూమరేటర్లు పైఅధికారులకు చెప్పారు. అయితే తొలుత అంతా కులగణన సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు ఇస్తారని భావించారు. కానీ గ్రామసభలు పెట్టి నూతన కార్డులు ఇస్తామని మంత్రులు ప్రకటించారు. ఈ మేరకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఈ క్రమంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డులు ఇస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్‌లో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని స్పష్టం చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నలభై వేల మందికి మాత్రమే రేషన్ కార్డులు ఇచ్చారని.. కానీ మేం అర్హులందరికి రేషన్ కార్డులు ఇస్తామన్నారు. నలభై లక్షల రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు. రేషన్ కార్డుల ద్వారా ఆరు కిలోల సన్నబియ్యం ఉచితంగా ఇవ్వబోతున్నామని రాష్ట్ర ప్రజలకు మంత్రి చెప్పారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. వ్యవసాయయోగ్యమైన భూములకి ఏడాదికి రూ.12 వేలు.. భూమిలేని రైతు కూలిలకి కూడా ఏడాదికి పన్నెండు వేలు ఇవ్వబోతున్నామని తెలిపారు. పెండింగ్‌లో నారాయణ పూర్ రిజర్వాయర్ పూర్తిచేసి తీరుతామని హామీ ఇచ్చారు. నారాయణపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి కావాలసిన నిధులు వెంటనే విడుదల చేస్తామని చెప్పారు.

# తెలంగాణలో కొనసాగుతున్న పెట్టుబడుల వేట

(మొదటి తరువాయి)



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కంట్రోల్ ఎస్ సంస్థ ప్రతినిధులు సంతకాలు చేశారు. తెలంగాణలో అత్యాధునిక డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు తెలంగాణ బృందంతో భేటీ అనంతరం సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణ ప్రభుత్వంతో ఈ ఒప్పందం కుదిరింది. ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ఓవరాల్ గా 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ రూపొందనుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని తెలంగాణ ప్రతినిధులు అంచనా వేశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కంట్రోల్ ఎస్ వారు నెలకొల్పనున్న ఈ డేటా సెంటర్ మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఐటీ సేవల సామర్థ్యం తెలంగాణలో పెరుగుఉందని, నగరంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణ ఐటీ సేవలలో మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోవటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం చేసుకోవడంపై గర్వంగా ఉందన్నారు. యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు ప్రభుత్వంతో చర్చలు జరిపింది. వినియోగ వస్తువుల తయారీలో యూనిలీవర్‌కు మంచి పేరుంది. కామారెడ్డిలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుతో పాట్ను బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు యూనిలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆపై టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ సైతం హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకొచ్చింది. 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ సెంటర్ ఏర్పాటుతో 5000 మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# నేటితో బేటీ బచావో, బేటీ పడావోకు పదేళ్లు

(మొదటి తరువాయి)

ఇది ఒక కీలక పరివర్తన, ప్రజల–ఆధారిత చొరవగా మారింది. అన్ని వర్గాల భాగస్వామ్యాన్ని పొందిందని' ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. లింగ అడ్డంకులు, పక్షపాతాలను అధిగమించడంపై ఈ ఉద్యమం దృష్టి సారించిందని, ఆడపిల్లలకు విద్య, అవకాశాలు ఉండేలా చూసేందుకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆడ పిల్లల లింగ నిష్పత్తులను సమతుల్యం చేయడం కోసం ప్రజలతోపాటు వివిధ కమ్యూనిటీ సంస్థలు చేపట్టిన ప్రయత్నాలకు, అంకిత భావానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పిల్లల లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న జిల్లాలు గణనీయమైన మెరుగుదలను సాధించాయని, అవగాహన ప్రచారాలు లింగ సమానత్వం, ప్రాముఖ్యతను తెలియజేయడంలో హితోదికంగా తోడ్పడ్డాయన్నారు. దేశంలోని మహిళల హక్కులను కాపాడేందుకు, వారి విద్యకు భరోసా కల్పించేందుకు ఈ ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ‘ఈ ఉద్యమాన్ని కింది స్థాయి నుంచి ఉధృతం చేసిన భాగస్వాములందరినీ అభినందిస్తున్నానన్నారు. మన కుమార్తెల హక్కులను పరిరక్షించడాన్ని కొనసాగిద్దాం, వారి విద్యను నిర్ధారిద్దాం. కలిసికట్టుగా వారి కోసం ఎటువంటి వివక్ష లేకుండా అభివృద్ధి చెందగల సమాజాన్ని సృష్టిద్దాం. రాబోయే రోజుల్లో మన దేశ కుమార్తెలకు గొప్ప పురోగతిని, అవకాశాలను వస్తాయ్’ అని మోదీ అన్నారు

# సోయిలేని కాంగ్రెస్ పాలన

(మొదటి తరువాయి)

ఆఫీసులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గూండాలు దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని బూతులు తిడుతూ పోలీసుల ముందే దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. దాడి చేసింది మంత్రి గూండాలు అయితే.. పోలీసులు భూపాల్ రెడ్డిని అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఫైర్ అయ్యారు. ప్రశ్నించిన తమ నేతను అరెస్ట్ చేసి.. దాడి చేసిన వారిమీద ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇదీ కాంగ్రెస్ అరాచక పాలన తీరని మండిపడ్డారు. తమ నాయకుడు కంచర్ల భూపాల్ రెడ్డి మీద జరిగిన పాశవిక దాడిని ఖండిస్తున్నానన్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ ఎక్స్‌లో పేర్కొన్నారు ఇదిలాఉండగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ తలసాని శ్రీనివాసరావు ఇంట్లో సమావేశమయ్యారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కాంగ్రెస్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాదనే నిజాన్నిహైదరాబాద్ ప్రజలు అర్థం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కాపాడాలని ఈ ప్రభుత్వానికి సోయి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.

# కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

(మొదటి తరువాయి)

పెద్ద నగరాన్ని తలపిస్తోంది. ఇందుకు సంబంధించి కొన్ని చిత్రాలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ తాజాగా విడుదల చేసింది. స్పేస్ సెంటర్ నుంచి కుంభమేళా ఏరియాను ఉపగ్రహాలు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. మహాకుంభ మేళాకు సంబంధించిన ఏర్పాట్లు చేయకముందు, చేసిన తర్వాత తీసిన ఫొటోలను షేర్ చేసింది ఇస్రో. ఆ ఫొటోల్లో గతేడాది ఏప్రిల్‌లో మహాకుంభ్ ప్రాంతం మొత్తం నిర్మానుష్యంగా కనిపించింది. ఇక డిసెంబర్ 22 నాటికి నిర్మాణాలు వెలిశాయి. ఈ నెల 10న తీసిన ఫొటోల్లో ఓ పెద్ద నగరాన్ని తలపించేలా మహాకుంభ్ ప్రాంతం దర్శనిమచ్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు. హెల్త్‌కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేశారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక కుంభమేళా ప్రాంతంలో 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. మతపరమైన అకాడాలకు కూడా ప్రత్యేక టెంట్లను కేటాయించారు.

# బీజేపీని ఇరుకున పెట్టేందుకు ప్లాన్

(మొదటి తరువాయి)

హామీలను గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను రిలీజ్ చేశారు. మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకునే ఏడు అంశాలను ఈ మేనిఫెస్టోలో పెంచుపర్చారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే కేంద్ర వార్షిక బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు మేలు చేసేలా ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో బీజేపీని ఆప్ కేంద్ర ప్రభుత్వం ముందుంచిన ఏడు డిమాండ్లు ఇవే..కేంద్ర బడ్జెట్‌లో ఎడ్యుకేషన్ కేటాయింపులను 2 శాతం నుంచి 10 శాతానికి పెంచాలి. ప్రైవేట్ స్కూల్ ఫీజులపై ప్రభుత్వ నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఉన్నత విద్య చదివే వారికి సబ్సిడీలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. హెల్త్ బడ్జెట్‌ను 10 శాతానికి పెంచాలి. అలాగే ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపులపై పన్ను రద్దు చేయాలి. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుత రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. నిత్యావసర సరకులపై జీఎస్టీని ఎత్తివేయాలి. సీనియర్ సిటిజన్లకు బలమైన రిటైర్మెంట్ ప్లాన్, పెన్షన్ స్కీమ్స్ తీసుకురాలి. దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించాలి. దేశ వ్యాప్తంగా రైలు ప్రయాణ టికెట్లలో సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీ కల్పించాలి.

# సంపాదకీయం

## ట్రంపరితనంతో... లాభమెంత..నష్టమెంత?

ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కొందరికి నచ్చకపోవచ్చు...కానీ అమెరికన్లకు మాత్రం నచ్చి తీరుతుంది. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం బాగా ప్రాచుర్యం పొందింది. ఏ పాలకుడైనా తమ దేశ ప్రయోజనాలను మాత్రమే చూస్తారు. అందుకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటారు. ట్రంప్ కూడా ఇప్పుడు అదేవిధమైన విధానాలతో ముందుకు సాగుతున్నారు. కాకపోతే అమెరికాపై చాలామింది ఆధారపడి బతుకుతున్నందున వారికి ఇవి నచ్చకపోవచ్చు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ పిల్లలను కని, వారిని అమెరికా పౌరులు చేస్తామంటే ఎవ్వరికైనా మండుతుంది. ట్రంప్‌కు అక్కడే మండింది. అందుకే జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేశారు. ఉద్యోగాలు కూడా స్థానికులకే ఇవ్వాలన్నది ఆయన మొదటినుంచి పట్టుబడుతున్న వ్యవహారమే. హెచ్-1 వీసాల విషయంలోనూ ముఖ్యంగా భారతీయుల్లో ఆందోళన నెలకొంది. మాకు దక్కాల్సిన ఉద్యోగాలను ఎగరేసుకుని పోతున్నారని అమెరికన్లు ఎప్పటి నుంచే గగ్గోలు పెడుతున్నారు. ఇవన్నీ కూడా ట్రంపం ఎన్నికల ప్రచారంలో బాగా ప్రాచుర్యం పొందినవే. అమెరికాకు అనుగుణంగా ట్రంప నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీటిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇవి మనకు అనుకూలంగా లేవు కనక మనం బధపడుతున్నారు. అమెరికా ఫస్ట్ అన్న ఆయన నినాదం మేరకు నిర్ణయాలు ఉంటాయని తెలియచేస్తున్నారు. అలా అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసీ చేయగానే ట్రంప్ తను గతంలో ప్రకటించిన మేరకు నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టారు. అందులో ఒకటి- పారిస్ ఒప్పందం నుంచి మళ్లీ బయటకు రావడం. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడతానంటూ తొలిరోజు ప్రసంగంలో దేశ ప్రజలకు హామీ ఇచ్చిన ట్రంప్.. భూతాపానికి ముకుతాడు వేసేందుకు 190కి పైగా దేశాలు ఒక్కతాటిపైకి వచ్చి కుదుర్చుకున్న ఒడంబడికనుంచి వైదొలగడంమిగతా ప్రపంచ దేశాలకు నచ్చలేదు. అందుకే అమెరికాకు తొలిసారి అధ్యక్షుడయ్యాక ట్రంప్ ఈ ఒప్పందంనుంచి వైదొలగడంతో ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చాయి. దూకుడుతనానికీ, దుందుడుకు స్వభావానికి డొనాల్డ్ ట్రంప్ పెట్టింది పేరు. అలా ఉండటమే తనకు రెండోసారి అధ్యక్ష పదవిని కట్టబెట్టిందని ఆయన ప్రగాఢంగా విశ్వసిస్తారు. కీలకమైన పారిస్ ఒప్పందం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకున్న బైడెన్, తాను అధికారంలోకి వచ్చాక 2021లో మళ్లీ ఒప్పందంలో అమెరికాను చేర్చారు. తాను పట్టిన కుందేటికి మూడేకాళ్లు అని నిర్ద్వంద్వంగా, నిస్సంకోచంగా వాదించే ట్రంప్ మళ్లీ అధ్యక్షుడు కాగానే ఈ ఒప్పందాన్ని కాలరాచేందుకు ఉద్యుక్తుడయ్యారు. అంతేకాదు, కొవిడ్ వ్యాప్తి సమయంలో బాధ్యతారహితంగా ప్రవర్తించిందనే ఆగ్రహంతో ప్రపంచ ఆరోగ్య సంస్థనుంచి కూడా వైదొలగుతూ ఆయన నిర్ణయం తీసుకోవడం జరిగింది. దీనివల్ల అమెరికాకు వచ్చే లాభం ఎంతన్నది ఆయన చేస్తున్న వాదనగా ఉంది. కృత్రిమ మేధ విస్తరిస్తే మనవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని, బైడెన్ ప్రభుత్వం దీని విస్తరణపై విధించిన ఆంక్షలను తాజాగా ట్రంప్ తొలగించారు. కీలకమైన అంశాలపై లోతైన అధ్యయనం, విస్తృతమైన చర్చలు.. ఏవీ లేకుండా వచ్చీరాగానే కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేయడం ఆయన తొందరపాటుకు నిదర్శనమనే చెప్పాలి. పదవిలోకి రాకముందే హమాస్- ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలికారనే ఘనతను ట్రంప్ దక్కించుకున్నారు. ఆయన హెచ్చరికలవల్లే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ దిగి వచ్చారని విశ్వసించేవారు ఎంతోమంది ఉన్నారు. రష్యా -ఉక్రెయిన్ యుద్ధానికి కూడా ట్రంప్ చరమాంకం పలుకుతారని ఆయన అనుయాయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు యుద్ధ విరమణకు కృషి చేస్తూ, మరోవైపు గ్రీన్‌లాండ్‌నూ, పనామా కాలువనూ స్వాధీనం చేసుకుంటామంటూ తొలిరోజే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ట్రంప్ మనస్తత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అనేది ఇక్కడ ప్రశ్న. తొలిసారి మాదిరిగానే ఈసారి కూడా ట్రంప్ ప్రసంగం దూకుడుగా, తన మద్దతుదారులు, దేశప్రజలలో ఉత్సాహం నింపేదిగా సాగింది. 'అమెరికాకు స్వర్ణయుగం మొదలైంది. మునుపెన్నడూ లేనంత దృఢమైన, పటిష్ఠమైన, అసాధారణమైన దేశంగా అమెరికాను తీర్చిదిద్దుతా'నంటూ ఆయన అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మొదటిసారికంటే ఈ తడవ మరింత శక్తిమంతమైన నేతగా ట్రంప్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రతినిధుల సభలోనూ, సెనేట్‌లోనూ మెజారిటీ బలం రిపబ్లికన్ పార్టీదే కావడం ఇందుకు కారణం. భారత్,అమెరికా ద్వైపాక్షిక సంబంధాల విషయానికొస్తే మోడీ- జో బైడెన్ హయాంలో ఇరుదేశాల మధ్య బంధం మున్నెన్నడూ లేనంతగా బలోపేతమైందనేది జగద్విదితం. శత్రువుకు శత్రువు మనకు మిత్రుడన్న నానుడిని నిజం చేస్తూ ఇరు దేశాలకూ పక్కలో బ్లలెంలా మారిన చైనా.. ఈ రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలు బలపడటానికి కారణమైంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ భారీ సుంకాలు విధిస్తోందని అంటూ ఇప్పటికే పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్, భారత్ ఉత్పత్తులపైనా అదే విధంగా సుంకాలు విధించే అవకాశం ఉండవచ్చు. అంతమాత్రానికే, ఇరు దేశాల మధ్య సంబంధాలు బలహీన పడతాయని భావించరాదు. ట్రంప్ విదేశాంగ విధానంలో కొంత గందరగోళం ఉంటుందన్నది విస్పష్టం. అమెరికాకు ప్రత్యామ్నాయ ఆర్థిక శక్తిగా ఎదిగుతున్న చైనా మెడలు వంచడం అనుకున్నంత సులభమేమీ కాదు. ఏదేమైనా ఎవరి విధానాలు వారివి. వారికి అనుగుణంగానే ఇతర దేశాలు నడుచుకోవాలి. అవి మనకు ఉపయోగమా కాదా అన్నది ముఖ్యం కాదు. అక్కడి చట్టాలు, పరిస్థితులకు అనుగుణంగా మనం నడుచుకోగలమా లేదా అన్నదే ముఖ్యం.

## ఒప్పందాలు.. పొలికేకలు..




ఆకలి కేకలు ఒకచోట.. అన్నపు రాసులు మరోచోట అన్నాడో కవి. ప్రస్తుతం రాష్ట్రంలోని పరిస్థితులకు సరిగ్గా సరిపోయే వాక్యాలివి. భారీగా పెట్టుబడులను పట్టుకొస్తామంటూ ముఖ్యమంత్రి రేవంతుడు దావోస్‌లో పర్యటిస్తున్నారు. అదే సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఒరిస్సాలో పర్యటించి వచ్చారు. గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రుల జాతీయ సమావేశంలో పాల్గొన్న ఆయన%ో% తెలంగాణలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు రూ.1.63 లక్షల కోట్లు ఇప్పించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గనుల రంగంలో సంస్కరణలు తెస్తామంటూ అదే వేదిక మీద నుంచి కిషన్‌రెడ్డి నొక్కి వక్కాణించారు. సరిగ్గా అదే రోజు రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా మైలారంలోని ప్రజలు తమ ప్రాంతంలోని గుట్ట (తెల్లరాయి నిక్షేపాలు)ను కబళించి, మైనింగ్ జరపటానికి వీల్లేదంటూ ఆందోళనకు దిగటం గమనార్హం. వారిలో ఓ ఇద్దరు ఏకంగా ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు కూడా. ఈ దృష్టాంతాలన్నింటినీ పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తేటతెల్లమవు తున్నాయి. గతంలో నల్లమల అడవుల్లో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు పెల్లుబికాయి. ఆ సందర్భంగా సీపీఐ(ఎం), ఇతర వామపక్షాలు అక్కడి గిరిజనులకు అండగా నిలిచాయి. ఇప్పుడు కేంద్ర మంత్రి చెబుతున్న 'గనుల సంస్కరణలు' ఏ రకంగా ఉంటాయో ఆయనే చెప్పాలి. ఎందుకంటే రాష్ట్రంలోనే కాదు.. దేశవ్యాప్తంగా పలు గిరిజన ప్రాంతాల్లో మైనింగ్, ఇతరత్రా తవ్వకాలపై ఆందోళనలు కొనసాగాయి. కానీ సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు యధేచ్ఛగా కట్టబెడుతున్న బీజేపీ%ో% ఆయా సంస్థల ప్రయోజనాల కోసం ఆదివాసీల జీవితాలను ఫణంగా పెడుతున్నది. పర్యావరణానికి, నదీ జలాలకు పెనుముప్పు వాటిల్లుతుందంటూ సామాజికవేత్తలు నెత్తీనోరు బాదుకుంటున్నా వినకుండా కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. దీనిపై పెదవి విప్పని రాష్ట్ర ప్రభుత్వం%ో%మైనింగ్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు వెళ్లిన పౌరహక్కుల నేతలను అడ్డుకోవటం శోచనీయం. అంటే కేంద్ర పాపంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పాలుపంచుకోవాలను కుంటోందా? ఈ విషయమై రేవంత్ సర్కార్ స్పష్టతనివ్వాలి. మరోవైపు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక సాయం (ఆత్మీయ భరోసా), ఆసరా పింఛన్ల పెంపునకు సంబంధించి మంగళవారం నుంచి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ప్రతీ గ్రామంలోనూ లబ్దిదారులు బారులు తీరుతున్నారు. ఇది రాష్ట్రంలో గూడు లేని పేదలు, ఆసరా దొరకని వృద్ధులు, పూట గడవని వ్యవసాయ కూలీల గోసకు నిదర్శనం. ప్రతీ ఊర్లోనూ 20 నుంచి 30 మంది లబ్దిదారులనే ఎంపిక చేసి, మిగతా వారికి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులు సూచించటం విడ్డూరం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజులకే 'ప్రజాపాలన' అంటూ హడావుడి చేసిన సర్కారు%ో% ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా తదితరాల కోసం దరఖాస్తులను స్వీకరించింది. ఇది జరిగి ఏడాది గడిచిన నేపథ్యంలో మళ్లీ ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని చెప్పటం పేదల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట. ఇవన్నీ కాలయాపన చేసే చర్యలేనంటూ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శిస్తున్న నేపథ్యంలో అర్హులైన పేదలందరికీ పథకాలను చేరువ చేయటం ద్వారా సర్కారు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియంటూ ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ప్రకటించినప్పటికీ ఆచరణలో అది ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకం. దీనిపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అపోహలను ప్రభుత్వం పోగొట్టాలి. అందుకోసం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసర ముంది. గ్రామాలు, పట్టణాల్లో లబ్దిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తు తున్న దరిమిలా పార్టీలకు అతీతంగా అందరికీ సమన్యాయం చేస్తామన్న భరోసాను కల్పించాలంటూ పేదలు వేడుకుం టున్నారు. దావోస్‌కు వెళ్లి పెట్టుబడులు తేవటం మంచిదే. కానీ చంద్రబాబు కాలం నుంచి ప్రతీ ముఖ్యమంత్రి దావోస్‌కు పయనమవుతున్నారు. ఇన్ని కోట్లు, అన్ని కోట్ల రూపాయలు పెట్టుబడులొస్తున్నాయంటూ ప్రకటిస్తున్నారు. నిజానికి అవన్నీ ఎక్కడికి పోయినాయో ఏలినవారికే తెలియాలి. అంతకంటే ముందు రాష్ట్రంలోని పేదలకు కూడు, గూడు, బట్ట తదితర ప్రాథమిక అవసరాలను తీర్చటం ముఖ్యం. ఈ దిశగా రేవంత్ సర్కార్ దృష్టి సారించాలి.

## కార్పొరేట్ల కేరింత



సామ్రాజ్యవాదం, దుందుడుకువాదం కలబోసిన డోనాల్డ్ ట్రంప్ అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సమయంలో ఆయన ప్రసంగం, తీసుకున్న నిర్ణయాలు, సభకు హాజరైన వందిమాగధుల, కార్పొరేట్ శక్తుల ఆహా ఓహోలు అన్నీ ఊహించినవే. పచ్చి మితవాదిగా, కళంకితుడిగా, తెంపరిగా ఇంటాబయటా విమర్శలు మూటగట్టుకున్న ఆయన మళ్లీ ఎన్నికై, అధ్యక్ష పగ్గాలు చేపట్టడం పట్ల ఆ దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. హెచ్ 1బి వీసాలు, అమెరికాలో పుట్టిన వారికిచ్చే పౌరసత్వం, వలసలపై ఉక్కుపాదం మోపే ఆయన విధానం%ో% తగిన అనుమతులు లేకుండా అక్కడ నివసిస్తున్న ప్రవాసులకు, అగ్రరాజ్యాన్ని ఆరాధిస్తున్న భారతీయులు సహా చాలా దేశాల్లోని యువతకు అశనిపాతమే! 2016 ఎన్నికల్లో 45వ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన ట్రంప్ ఎన్నో వివాదాస్పద నిర్ణయాలు, వ్యవహారాలకు చిరునామా. కోవిడ్ సమయంలో అత్యంత బాధ్యతారహిత నిర్వాకం వల్ల 12 లక్షల మంది అమెరికన్లు మరణించారు. తన వైఫల్యాల నుంచి తప్పుకోవాలన్న ట్రంప్ ఒత్తిడికి లొంగకపోవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలిగారు. బైడెన్ ఆ నిర్ణయాన్ని తిరగదోడి, అంతకుముందు మాదిరే నిధులిచ్చారు. ఇప్పుడు మళ్లీ ట్రంప్ రాకతో కథ మొదటికొచ్చింది. గత ప్రభుత్వం తీసుకున్న 78 నిర్ణయాల రద్దులో ఇది ఒకటి. 2016లో వాతావరణ మార్పులపై కుదిరిన పారిస్ ఒప్పందం నుంచి అప్పట్లో ట్రంప్ వైదొలగడం.. ఆ తరువాత బైడెన్ మళ్లీ చేర్చడం.. ఇప్పుడు మరోసారి వైదొలగడం జరిగిపోయాయి. అత్యధిక కాలుష్యానికి కారణమైన దేశాల్లో ఒకటైన అమెరికా%ో% ఆ కాలుష్యం, భూతలం వేడెక్కకుండా చూసే బాధ్యత నుంచి వైదొలగడం అత్యంత దుర్మార్గం.

ఇటువంటి నిర్వాకంతో 2020 ఎన్నికల్లో పరాజయం పాలైనా%ో% శ్వేతసౌధాన్ని బలవంతంగానైనా స్వాధీనం చేసుకునేందుకు తన అనుచరులను ప్రేరేపించి, అల్లకల్లోలానికి కారణమయ్యారు. ఈ ఘటనకు బాధ్యులైన 1500 మందిపై కేసులు ఉపసంహరించడంతోపాటు, 14 మంది పచ్చి మితవాదులకు శిక్షలు తగ్గించారు. జో బైడెన్ అధ్వాన పాలన, ఉక్రెయిన్ %-% రష్యా ఘర్షణ, ఇజ్రాయిల్ ఎడతెరిపిలేకుండా సాగించిన రక్తపాతం, ఆకాశాన్నంటిన ద్రవ్యోల్బణం%ో%తదితర అంశాలను ట్రంప్ ఆయాచితంగా అందిపుచ్చుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు ఎలాన్ మస్క్ అండతో అధికారం అందుకోగలిగిన కుబేరుడైన ట్రంప్%ో% అలాంటి ట్రిలియనీర్ల, బిలియనీర్ల ప్రయోజనాల కోసం%ో% విశ్వంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థను నడపబోతున్నారు%ో% ట్రంప్ 'స్వర్ణయుగం' ప్రారంభమైందన్నది వారి కోసమే! 'రారాజు' తిరిగి వచ్చాడంటూ ఎలాన్ మస్క్ సహా ట్రిలియనీర్ల ప్రశంసలు, హర్షద్వానాలు%ో% కార్పొరేట్ శక్తుల మరింత విజృంభణకు సూచిక. ట్రంప్, ఆయన మంత్రివర్గం సంపద 400 బిలియన్ డాలర్లు. అంటే 172 దేశాల జిడిపితో సమానం. ప్రపంచమంతా హరిత ఇంధనం కోసం చూస్తుంటే ఆర్కిటిక్ ప్రాంతంలో కోటీ 60 లక్షల ఎకరాల్లో చమురు తవ్వకాలపై నిషేధాన్ని ఎత్తేశాడు. దిగుమతులపై ఆంక్షలు పెడతానన్నాడు. ఇదే జరిగితే చైనాతోపాటు భారత్‌కూ ముప్పే. హెచ్1 బి వీసాలపైనా ఆంక్షలు విధించవచ్చన్న సంకేతాలున్నాయి. ట్రంప్ ఎన్నిక కాగానే డాలర్ బలపడుతుండగా మన రూపాయి పాతాళానికి దిగజారుతోంది. ఈ పరిస్థితుల్లో మన దేశానికి ఒనగూడే ప్రయోజనాలు, నష్టాలపై విస్తృతంగా సాగుతున్న చర్చకు ట్రంప్ 2.0లో అనుసరించబోయే విధానాలే సమాధానం చెప్పాల్సుంది. ఉక్రెయిన్ పోరును ఒక్కరోజులో ఆపుతానని చెప్పిన ట్రంప్ ఇప్పుడు ఒక్కరోజులోనే మాట మార్చి%ో%అంతా పుతినే చేస్తున్నాడని వ్యాఖ్యానిస్తున్నాడు. ఎప్పుడేం మాట్లాడతాడో, ఏం చేస్తాడో తెలీదన్న ముద్రకు తాజా వ్యాఖ్యలు మరో ఉదాహరణే! పూర్తిగా కార్పొరేట్ చేతుల్లో వున్న అగ్రరాజ్య పాలన అమెరికాతోపాటు ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గంపై, పేదలపై దాడిని మరింత ప్రేరేపించేదే. కొద్దిమంది చేతుల్లో ఉన్న అంతులేని సంపద కారణంగా ప్రపంచంలోని సామాన్య ప్రజలు నలిగిపోతున్నారన్న ఆక్స్‌ఫామ్ వ్యాఖ్యలు ఈ సత్యాన్నే బలపరుస్తున్నాయి. అమెరికా ధన దాహాన్ని, ఆయుధ పెత్తనాన్ని ప్రపంచ ప్రజలు ప్రతిఘటించాల్సిందే. అలా మాత్రమే దానికి, తెంపరి ట్రంప్ పాలనకు ముకుతాడు పడుతుంది.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి..?



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 22 ప్రజా స్వేచ్ఛ**
అనుమానస్పద స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన షాద్ నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూక్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామపంచాయతీ పరిధిలోని పిట్టలగడ్డ తాండకు చెందిన శివలీల (35) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో లాడ్జిలో శవమై తేలింది. శివలీల భర్త లేదని, ఒక కుమారుడు ఉన్నాడని పట్టణ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ ను వివరణ కోరగా తెలిపారు. లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేయగా శవాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సిఐ తెలిపారు. గత మూడు రోజుల క్రితం లాడ్జిలో శివలీలతో పాటు మరో వ్యక్తి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే వారు లాడ్జిలోనే ఉన్నారని భావించిన సిబ్బంది చివరకు మూడు రోజులుగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. శివలీల అనుమానాస్పద మృతి వెనుక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శివలీల మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. శివలీల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్లు తెలిపారు. శివలీలది నందిగామ మండలము స్వగ్రామం కాగా అత్తగారిది మొగలిగిద్ద పరిధిలోని పిట్టల గడ్డ తండా అని ప్రాథమికంగా తెలిసిందని పోలీసులు తెలిపారు.

**ముస్త్యాల గ్రామ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు యువజన, మహిళా, కుల, సంఘాలకు మరియు లైన్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు మనవి చేయునది ఏమనగా...**

**ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్**
ముస్త్యాల గ్రామం యందు రేపు అనగా 23/01/2025 ఉదయం 8:00 am గంటలకు మస్త్యాల గ్రామపంచాయతీ రైతు వేదిక వద్ద గ్రామ సభ కలదు

**అజెండా:**
ప్రజా పాలనలో భాగంగా
1,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,
2,రైతు భరోసా,
3,రేషన్ కార్డులుమంజూరు,
4, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్దిదారుల ముసాయిదా ఎంపిక
ఇంకా
5,అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తుల స్వీకరణ జరుగును
కావున తామందరు సకాలం లో హాజరై ఇట్టి గ్రామసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని మనవి.
ఇట్లు, స్పెషల్ ఆఫీసర్, జిపి ముస్త్యాల.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# అతి త్వరలో హయత్నగర్ కోర్టు నూతన బార్ అసోసియేషన్ హైకోర్ట్ జడ్జి గారిచే ప్రారంభం





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-బొడ్డు బిక్షపతి గౌడ్.**

**ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్**
ఈ రోజు హయత్నగర్ కోర్టు నూతన బార్ అసోసియేషన్ ను సందర్శించి న్యాయవాదుల పరస్పర సహకార సంగ%శీ% సంచాలకులు బాచిరెడ్డి శాయిరెడ్డి మరియు పూర్వ సంచాలకులు బర్ల సునీత హయత్నగర్ నూతన బార్ అసోసియేషన్ నిర్మాణం పనులు పూర్తి అయినాయని అసోసియేషన్ హాల్ ప్రారంభించు కోవచ్చు అని తెలిపినారు. ఈ విషయాన్నీ హైకోర్టు జడ్జి గారి దృష్టికి తెలుపగా వారు అతి త్వరలో హయత్నగర్ కోర్టు ను సందర్శించి నూతన బార్ అసోసియేషన్ హాల్ ను ప్రారంభిస్తామని తెల్పినారు. ఈ సందర్భంగా నూతన బార్ అసోసియేషన్ హాల్ నిర్మాణానికి పూర్తి భాద్యత తీసుకొని సర్వహంగులతో నిర్మించిన న్యాయవాదుల పరస్పర సహకార సంగమ్ అధ్యక్షులు పిల్లేరిశెట్టి శ్రీనాథ్ గారికి, కార్యదర్శి తడకంటి శ్రీధర్ గారికి, కోశాధికారి తొర్నాల గిరి గారికి మరియు నిర్మాణ భాద్యతలు పూర్తిగా తన భుజాలపై వేసుకొని అద్భుతమైన నూతన బార్ అసోసియేషన్ హల్ ను నిర్మించిన సంచాలకులు బాచిరెడ్డి శాయిరెడ్డి గారికి, పూర్వ సంచాలకులు బర్ల సునీత గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెల్పినారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు హయత్నగర్ కోర్టు బార్ అసోసియేషన్ మరియు టీపీసీసీ లీగల్ సెల్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ బొడ్డు బిక్షపతి గౌడ్ గారు, సంయుక్త కార్యదర్శి బండి నరేష్, గ్రంధాలయ కార్యదర్శి మేకల సతీష్ మరియు న్యాయవాది రాజవర్ధనరెడ్డి ఇతర సభ్యులు పాలుగోన్నారు.

# సంక్షేమ పథకాల అమలుపై అపోహలు వద్దు:

**-అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు**

**గద్వాల జిల్లా బ్యూరో, జనవరి 22(జర్నలిస్ట్ డైరీ)**
ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు మాత్రమే దక్కుతాయని, ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన గ్రామసభలలో భాగంగా బుధవారం కేటిదొడ్డి మండల కేంద్రంతో పాటు ఉమిత్యాల తండాలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో గద్వాల ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లను నిజమైన అర్హులకే అందిస్తామన్నారు. గల్లీ గల్లీకి తిరిగి ఇల్లు లేని పేదలకు మాత్రమే ఇంటి నిర్మాణానికి నిధులు చెల్లిస్తామన్నారు.
ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలలో పైరవీలకు అవకాశం లేదన్నారు. అర్హులైన



వారందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తారని ఇది నిరంతరం ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎంపీడీఓలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

**-రోడ్డు నిర్మాణాలకు భూమి పూజ**
కేటిదొడ్డి గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణానికి గద్వాల ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అదే విధంగా త్వరలోనే కె.టి దొడ్డి మండల కేంద్రం నుండి కుచ్చినెర్ల వరకు, కేటిదొడ్డి నుండి గువ్వలదిన్నె వరకు త్వరలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్( స్థానిక సంస్థల) నర్సింగరావు, గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ హనుమంతు, ఎంపీడీవో కృష్ణమోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ , మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్లు ఆంజనేయులు, సత్యనారాయణ , నాయకులు చక్రధర్ రావు, ఉరుకుంద, శేఖర్ రెడ్డి, వెంకటన్న గౌడ్, చంద్రశేఖర్, రాజేష్, తిమ్మారెడ్డి, శేఖర్ రెడ్డి, గోపి , పవన్ రెడ్డి, టీచర్ గోవిందు, నాసిర్, వెంకటేష్, వీరేష్, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఫుట్ పాత్ వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

**-ట్రాఫిక్ సమస్యల పేరుతో ఫుట్ పాత్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దు**

**- మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్, జనవరి 22 ప్రజా స్వేచ్ఛ**
ఫుట్ పాత్ వ్యాపారుల పట్ల ప్రభుత్వం, అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని వందలాదిమంది ఫుట్ పాత్ వ్యాపారులు, హాకర్స్ మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి తమ బాధలను విన్నవించి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన సికింద్రాబాద్ లోని జీహెచ్ ఎంసీ నార్త్ జోన్ కార్యాలయంలో, ట్రాఫిక్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. 50 సంవత్సరాల నుండి ఫుట్ పాత్ లపై, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని వివరించారు. ఫుట్ పాత్ లపై వ్యాపారాలు తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని, పేదల జీవనోపాధిని దెబ్బతీయొద్దని అన్నారు. ట్రాఫిక్ కు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఫుట్ పాత్ వ్యాపారుల జీవనోపాధికి భంగం వాటిల్లకుండా చూడాలని




చెప్పారు. గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఫుట్ పాత్ వ్యాపారులకు అవసరమైన ఆదేశాలు, సూచనలు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అంతేకాకుండా అర్హులైన ఫుట్ పాత్ వ్యాపారులకు ఫోటో తో కూడిన గుర్తింపు కార్డులను కూడా అందజేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్




రాజు, బేగంపేట కార్పొరేటర్ టి.,మహేశ్వరి, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుష్మిత, బేగంపేట, మహంకాళి, గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు నాగులు, కిషోర్, శేఖర్, మహేష్ యాదవ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటీసీ సెంటర్ పనులను పరిశీలించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**ప్రజా స్వేచ్ఛ జనవరి 22 వనపర్తి ప్రతినిధి**
వనపర్తి మండలం రాజపేట లో గల అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కు ఐదు కోట్లు తో నిర్మాణ పనులు చేపడుతున్నారు.అట్టి పనులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.జిల్లెల చిన్నారెడ్డి పరిశీలించడం జరిగింది. ఏటీసీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది పక్కనే ఉంటున్న ఐటిఐ విద్యార్థులతో అక్కడున్న వసతులను పరిశీలించడం జరిగింది.మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించడం జరిగింది.

## జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి స్వాగతం పలికిన ఉప్పరి అజయ్



**ప్రజా స్వేచ్ఛప్రతినిధి కరీంనగర్ జనవరి 22**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి, కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి నల్లమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డికి, 53వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పరి అజయ్ జిల్లా స్పోర్ట్స్ స్కూల్లోని హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తో కలిసి ఉప్పరి అజయ్, జిల్లా ఇన్చార్జ్ మంత్రికి ఘనంగా సన్మానించారు. అనంతరం రేణికుంట గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించే ఉద్దేశం గా అంకురార్పణ చేసింది అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి,అత్యధికంగా గెలిపించాలని కోరారు.

## ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలే

**-కౌన్సిలర్ చింతల రాజశేఖర్**



**ఘట్ కేసర్, జనవరి 22, ప్రజా స్వేచ్ఛ**
ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందాలని మూడో వార్డు కౌన్సిలర్ చింతల రాజశేఖర్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు శ్రీ లక్ష్మీనరసింహ కాలనీ లో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో బుధవారం నాడు ఉదయం జరిగిన మూడో వార్డు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి అని ఆయన సూచించారు. 6 గ్యారంటీల లో దరఖాస్తులు చేసుకున్న ఇందిరమ్మ ఇండ్లు అయితేనేమి రేషన్ కార్డులు అయితేనేమి రైతు భరోసా అయితే నేమి ప్రజలకు సక్రమంగా మేలు జరగాలని ఆయన కోరారు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు నేరుగా వాళ్ళ ఇంటికి చేరాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మెట్టు గణేష్ యాదవ్, మీసాల శ్రీరాములు, శిరోమణి, సింగిరెడ్డి వినూత్ రెడ్డి, బాలగోని చిన్న నరసింహులు గౌడ్, సభ సూపర్వైజర్, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ వాణి, పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి, వార్డు ఆఫీసర్ రాములు,సాయి తేజ, సూపర్వైజర్ వినోద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది,మూడో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిటాల సునీత మనమరాలు పుట్టినరోజు వేడుకలకు హాజరైన శ్రీనివాస్ గౌడ్

**వెల్దండ, జనవరి 22ప్రజా స్వేచ్ఛ**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లా పరిధిలోని రాప్తాడు నియోజకవర్గం వెంకటాపూర్ గ్రామంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మనమరాలు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వెల్దండ మండలానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అదేవిధంగా, ఎమ్మెల్యే పరిటాల సునీతకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దావోస్ పర్యటనలో తెలంగాణ ప్రభుత్వం తొలి ఒప్పందం





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**దావోస్ప్రజా స్వేచ్ఛ**
స్విట్జర్లాండ్?లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఇఎఫ్) 2025 వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు దావోస్?లో తెలంగాణ ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ %ఖీవీజ+% దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. కాగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు. దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది.

# అంగరంగ వైభవంగా మల్లికార్జున స్వామి కళ్యాణం

**ప్రజా స్వేచ్ఛ జనవరి 22 రామన్నపేట ప్రతినిధి**
రామన్నపేట పట్టణ కేంద్రంలో బెక్కం నిఖిల్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం ఆరవ వార్షిక మహెూత్సవం సందర్భంగా బుధవారం స్వామివారి దివ్య కళ్యాణంను కన్నుల పండుగ గా నిర్వహించారు.గణపతి పూజ అనంతరం ఎదురకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. జంధ్యాధారణ,జీలకర్ర బెల్లం ధారణ,కన్యాదానం,మాంగల్య ధారణ వేడుకలను శాస్త్రం నిర్వహించారు.ఒగ్గు కళాకారుల బృందం స్వామి వారి దివ్య చరిత్రను వినిపించారు.మహిళలు వడి బియ్యం పోశారు.ఆలయ నిర్వహకుడు బెక్కం నిఖిల్ స్వామి,మఠం శశిధర్,వీర మహేశ్వర ఆర్చక బృందం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి భక్తులకు



అన్నదానం చేశారు.

**-ప్రాంత ప్రజలు మల్లన్న స్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**
**-నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం**

మలన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.బుధవారం నాడు ఆయన మల్లికార్జున స్వామి దేవాలయం లో స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు భక్తి భావన పెంపొందించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో గోదాసు శిరీష పృథ్వీరాజ్,ఉప్పు ప్రకాష్,జినుకల ప్రభాకర్,జెల్ల వెంకటేష్,ఎండి రెహాన్,సాల్వేరు రోజా లింగం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్,ఎండి అక్రమ్,కోట సుధాకర్,మోటి రమేష్,గొలుసుల ప్రసాద్, మాంద్ర నరేష్ భక్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై మాజీ కేంద్రమంత్రి ఆందోళన

**ప్రజా స్వేచ్ఛ జనవరి 22 కాకినాడ జిల్లా,కాకినాడ (సిటి):**
దళిత విభజన/ఎస్సీ వర్గీకరణపై మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది జాతీయ ఐక్యతకు పెనుముప్పుగా అభివర్ణించారు.స్థానిక హెూటల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణనంటూ జరిగితే మన భారత దేశం రెండు ముక్కలవుతుందన్నారు.రాబోయే 20 సంవత్సరాల్లో ఉత్తర భారతదేశం, దక్షిణ భారత దేశంగా అవతరించడం ఖాయమన్నారు.కారణం ఉత్తర భారతదేశంలో మాదిగలెక్కువగా వుంటారని,దక్షిణ భారతదేశంలో మాలలెక్కువగా ఉంటారని అన్నారు.దళిత విభజన వల్లే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ,ఆంధ్రా రాష్ట్రాలు ఏర్పాటైందన్నారు.
మొన్న అక్కినేని నాగార్జున ఇల్లు కొట్టేస్తోంటే, నాకు అయో పాపం అనిపించిందన్నారు. మనసులో చాలా బాధపడ్డానని,ఈ గొడవంతా ఎందుకొచ్చింది?? చాలా మందికి తెల్వదన్నారు. దళితుల జోలికి పోబట్టే,రాష్ట్రంవిడిపోయిందన్నారు పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎస్సీ వర్గీకరణపై తన అభిప్రాయం తెలపాలని కాకినాడ నుంచి తానడుగుతున్నానని,వెంటనే జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.తెలుగు దేశం పార్టీ పుట్టుకతోనే,దళితులపై అసూయ పడ్డదని,ఒక్కటిగా కలిసివున్న మాల, మాదిగలను ఎలాగైనా వేరు చేయాలని కుట్రలు పన్నారని ఆరోపించారు.పర్వతనేని



ఉపేంద్ర మాట్లాడిన మాటలు స్వయంగా నేనే విన్నానన్నారు.సుప్రీం కోర్ట్ 7 గురు న్యాయమూర్తులు ఇచ్చింది ఆర్డర్ కాదు,అది డిజార్డర్ అనివ్యాఖ్యానించారు 1994 లో కాన్సిరాం ఏపీకి వచ్చి,1700 మండలాల్లో తిరిగారని,ఎస్సీ,ఓబీసీలను కలపాలని,ఉత్తరప్రదేశ్ ఫార్ములా ఏపీలో సక్సెస్ చేయాలని ఆశించారన్నారు.కాన్సిరాం రాకతో కొంత మందికి కడుపు మండిందని అప్పుడే వారి మనస్సులో మాల,మాదిగ విభజనకు బీజం పడ్డదన్నారు.
స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు,దళిత విభజనకు పూనుకోవడం, విభజన వాదులను కొందరుప్రోత్సహించారన్నారు. యుపీ,తమిళనాడు ,కేరళలో లేని ఎస్సీ వర్గీకరణపై ఏపీలో ఏక సభ్య కమీషన్ వేయడం తప్పన్నారు.దీని తీవ్రంగావ్యతిరేకిస్తున్నానన్నారు .అమృతరావు సత్యాగ్రహం, రైతులు త్యాగాలు,ఎన్నో పోరాటాలు,ఎందరో బలిదానాలు,కాంగ్రెస్ పార్టీ, ఇందిరాగాంధీ కృషి వల్ల విశాఖ ఉక్కు వచ్చిందన్నారు.దీనిపై కార్పొరేట్ల కన్ను పడ్డదని,25 వేల ఎకరాలు ఉక్కు భూములను అమ్మి,సొమ్ము చేసుకోవాలనిఅనుకున్నారన్నారు.ఆకలిగా ఉన్నవాడి చేతికి అరటి పండు ఇచ్చినట్టు వుంది"కేంద్ర ప్రకటించిన 11 వేల కోట్లు సాయమని ఎద్దేవాచేశారు.ఉక్కు ఫ్యాక్టరీని ఐసీయూలోకి నెట్టింది తెలుగుదేశం ప్రభుత్వమేనని విమర్శించారు.ఐసీయూ నుంచి బయటపడ్డామని చంద్రబాబు నాయుడు మెడికల్ బాషలో చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నారు. విశాఖ ఉక్కును సంపూర్ణ స్థితికి తెచ్చే, బాధ్యత దావోస్ లో పర్యటనలో వున్న చంద్రబాబుదేననిఅన్నారు.బ్యాంకుల నుంచి ఒకాయన 45 వేల కోట్లు అప్పులు తెచ్చుకున్నాడని, అప్పు తిరిగి చెల్లించపోతే,ఎన్ పి ఏలిస్ట్ లో వెళ్లిందన్నారు.ఆ పెద్దమని నుంచి కేవలం 450 కోట్లు మాత్రమే వసూలు చేసి, 40 వేల కోట్ల రూపాయలు పైగా రుణ మాఫీ ఎలా చేస్తారు.?? ఏ పద్ధతి ప్రకారం రుణ మాఫీ చేశారని ప్రశ్నించారు.40 వేల కోట్లు ఎగ్గొట్టినాయనకు మళ్ళీ, 10 వేల కోట్లు అప్పులు ఇచ్చేందుకుతయారవుతున్నారని విమర్శించారు.దేశ జనాభాలో 25 శాతం వున్న ఎస్సీ, ఎస్టీలకు బ్యాంకులు ఇస్తున్న అప్పుల్లో 1 శాతం కూడా ఇవ్వడం లేదన్నారు

## బిజినెస్

# పరుగు పెడుతున్న పసిడి ధర..
# పసిడి ప్రియులకు ఇక కన్నీళ్లేనా!

ఈ ఏడాది ప్రారంభం నుంచి పసిడి ధరలు బ్రేకు లేకుండా పెరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో మకర సంక్రాంతి దగ్గరపడిన బంగారం ధర భారీగా పెరుగుతోంది. హైదారాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 82వేల రూపాయల మార్క్ దాటేసింది. ఇప్పటి వరకు స్థిరంగా ఉన్న బంగారం ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. అయితే పసిడి ధర పెరగడానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక పసిడి ధర తగ్గుతుందని భావించారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. ట్రంప్ వచ్చి రాగానే పాలసీలు మార్చడంతో గ్లోబల్ ఇన్వెస్టర్లలో గందరగోళం నెలకొంది. స్టాక్‌మార్కెట్‌లో తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. ఆ మొత్తాన్ని బంగారం కొనుగోళ్ల వైపు మళ్లిస్తున్నారు. భారత రిజర్వ్ బ్యాంక్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లు విపరీతంగా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ఇది కూడా బంగారం ధరలు పెరగడానికి కారణంగా కనిపిస్తున్నాయి. యుద్ధ భయాలు కూడా గోల్డ్ రేట్లపై ప్రభావం చూపిస్తున్నాయి. చాలామంది స్టాక్‌మార్కెట్‌లు అంత సేఫ్ కాదన్న అంచనాతో ఉన్నారు. దీంతో బంగారంపైనే భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఫైనల్‌గా



పసిడి ధర ఆల్ టైమ్ రికార్డ్ వైపుగా దూసుకెళ్తోంది. అతి త్వరలో లక్ష రూపాయల మార్క్‌ను టచ్ చేయడం ఖాయమన్న అంచనాలు ఉన్నాయి.

**దేశీయ గోల్డ్ రేట్లు ఇంకా పెరుగుతాయా?**

అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు భారీగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో దేశీయ గోల్డ్ రేట్లు ఇంకా పెరుగుతాయా? బడ్జెట్లో ఎలాంటి నిర్ణయాలు ఉండే అవకాశం ఉంది? ఫిబ్రవరి 1 తర్వాత బంగారం పయనం ఎటు అన్న చర్చ జోరందుకుంది. బంగారం ధరలు కట్టడి చేసేందుకు ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకోవాలని సగటు పసడి ప్రియులు కోరుతున్నారు. గతేడాది జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు. దీంతో గోల్డ్ రేట్లు ఒక్కసారిగా దిగి వచ్చాయి. మళ్లీ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయం వచ్చేసింది. ఈ క్రమంలో మరోసారి సుంకాలు తగ్గించి బంగారం ధరల పెరుగుదలను కట్టడి చేయాలని ఆశిస్తున్నారు.

**దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ పెంచే ఆలోచన!**

జులై, 2024లో బంగారం దిగుమతులపై సుంకాలు తగ్గిచడంతో ఆ తర్వాతి నెల ఆగస్టు 2024లో బంగారం దిగుమతులు 104 శాతం పెరిగాయి. అదే సమయంలో భారత్ నుంచి నగలు, రత్నాల ఎగుమతులు 23శాతానికి పడిపోయాయి. కస్టమ్స్ డ్యూటీ తగ్గించడంతో బంగారం వినియోగం భారీగా పెరిగింది. అది దేశ వాణిజ్య లోటును భారీగా పెంచింది. ఈ అసమానతలను తగ్గించేందుకు కేంద్రం మళ్లీ బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ పెంచాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 1, 2025 రోజున ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దీనిపై ప్రకటన చేసే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## ఐఫోన్‌లోనూ ఇక ట్రూకాలర్..




**బెంగళూరు**

కమ్యూనికేషన్స్ వేదిక ట్రూకాలర్ ఫీచర్ ఇకపై ఐఫోన్‌లోనూ అందుబాటులోకి వచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. దీంతో స్పామ్, స్కామ్ బ్లాకింగ్ సామర్థ్యాలను ఐఫోన్ వినియోగదారులకు అందించనున్నట్లు ట్రూకాలర్ వెల్లడించింది. అన్ని రకాల కాల్స్‌ను గుర్తించే సామర్థ్యం లభించనుందని పేర్కొంది. ట్రూకాలర్ 15 సంవత్సరాలుగా అవాంఛనీయ కమ్యూనికేషన్ ఫిల్టర్ చేసే టెక్నాలజీలో ఉంది. స్పామ్ కాల్స్ ఆటోమాటిక్ బ్లాకింగ్ సదుపాయాలను కల్పిస్తుందని ట్రూకాలర్ సిఇఒ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా పేర్కొన్నారు. ఐఫోన్‌లోనూ ట్రూకాలర్‌ను అందుబాటులోకి తేవడంపై సంతోషంగా ఉందన్నారు.ర

## హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు రూ.16,736 కోట్ల లాభాలు

**ముంబయి**

ప్రయివేటు రంగంలోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆర్థిక సంవత్సరం 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 2.2 శాతం వృద్ధితో రూ.16,736 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2023-24 ఇదే త్రైమాసికంలో రూ.16,373 కోట్ల లభాలు నమోదు చేసింది. క్రితం క్యూ3లో ఆ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 7.7 శాతం పెరిగి రూ.30,650 కోట్లకు చేరింది. 2024 డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ స్థూల అడ్వాన్సులు 3 శాతం పెరిగి రూ.25,42,600 కోట్లకు చేరాయి. స్థూల నిరర్థక ఆస్తులు 1.42 శాతానికి పెరిగాయి. ఇంతక్రితం ఏడాది నాటికి 1.26 శాతంగా జిఎన్‌పిఎ ఉంది. 2024 ముగింపు నాటికి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 9,143 శాఖలు, 21,049 ఎటిఎం కేంద్రాలను కలిగి ఉంది.

## 92% లోకలైజేషన్ సాధించాం

కార్ల తయారీలో 92 శాతం లోకలైజేషన్ సాధించామని, 1,200 కీలక విడిభాగాలు దేశీయంగానే తయారుచేస్తున్నామని హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్‌ఎంఐఎల్) ప్రకటించింది. విద్యుత్ వాహనాల బ్యాటరీ ప్యాక్‌లను కూడా దేశంలోనే తయారుచేస్తున్నట్లు వెల్లడించింది. మొబిస్ ఇండియా భాగస్వామ్యంతో తాము చెన్నై ప్లాంట్‌లో బ్యాటరీ ప్యాక్‌ల స్థానిక అసెంబ్లింగ్ చేపట్టినట్టు తెలిపింది. ఈ ప్లాంట్‌లో తయారైన బ్యాటరీ ప్యాక్‌తో మార్కెట్లోకి తెచ్చిన తొలి ఈవీ క్రెటా ఎలక్ట్రిక్ అని పేర్కొంది. ఈ స్థానికీకరణ చర్యల వల్ల 2019 నుంచి




67.2 కోట్ల డాలర్ల (రూ.5,678 కోట్లు) విదేశీ మారక ద్రవ్యం ఆదా అయినట్టు కంపెనీ తెలిపింది.

**క్రెటా ఈవీ ధర రూ.17.99 లక్షలు:**

హెచ్‌ఎంఐఎల్ క్రెటా ఎలక్ట్రిక్ కారును మార్కెట్లోకి తెచ్చింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో విడుదల చేసిన ఈ కారు ధర రూ.17.99 లక్షలు. రెండు బ్యాటరీ ఆప్షన్లలో ఇది అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్‌తో 51.3 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కారు 473 కిలోమీటర్లు, 42 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కారు 390 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి.

# ర్యాంకింగ్స్‌లో బుమ్రా హవా

**-అగ్రస్థానంలో టీమిండియా స్టార్ పేసర్**
**-ఐసీసీ తాజాగా ర్యాంకింగ్స్ ను విడుదల**

ఐసీసీ తాజాగా ర్యాంకింగ్స్ ను విడుదల చేసింది. ఇందులో టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన హవాను కొనసాగించాడు. 908 పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. రీసెంట్ గా జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన బుమ్రా.. ఆ సమయంలోనే 907 పాయింట్లతో టాప్ లో నిలిచాడు. ఆ సిరీస్ లో 5 టెస్టుల్లో 13.06 సగటుతో 32 వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్‌గానూ నిలిచాడు. ఇప్పుడు మరో పాయింట్ మెరుగుపరుచుకుని.. కెరీర్ బెస్ట్ పాయింట్స్ మార్క్ ను టచ్ చేశాడు. బుమ్రా తర్వాతి స్థానాల్లో వరుసగా ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్(841), సౌతాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడ(837) ఉన్నారు. ఇక పాకిస్థాన్ నోమన్ అలీ.. వెస్టిండీస్ పై తొలి టెస్ట్ లో ఆరు వికెట్ల ప్రదర్శన చేసి 761 పాయింట్లతో టాప్10లోకి దూసుకెళ్లాడు. ఆల్ రౌండ్ ర్యాంకింగ్స్ లో జడేజా




కూడా తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. 400 పాయింట్లతో టాప్ లో నిలిచాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అతడు నామమాత్రంగా ఆడాడు. ఈ సిరీస్‌లో మొత్తం ఐదు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన జడేజా .. 27 యావరేజ్ తో 135 పరుగులు సాధించాడు. ఆ తర్వాత సౌతాఫ్రికా మార్కో జాన్సన్ (294), బంగ్లాదేశ్ మెహ్ది హాసన్(263) ఉన్నారు. ఇక బ్యాటర్ల ర్యాంకింగ్స్ లో రోహిత్ శర్మ ఒక స్థానం దిగజారి కిందకు పడిపోయాడు.?43వ ర్యాంక్‌లో నిలిచాడు. హిట్ మ్యాన్ ఆస్ట్రేలియా సిరీస్ లో తీవ్రంగా నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఐదు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 31 పరుగులు మాత్రమే చేశాడు.

## చాహల్?ను ఎందుకు పక్కన పెట్టారు?

**-భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆగ్రహం**

భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా బీసీసీఐ మేనేజ్?మెంట్?పై గంభీరమైన ఆరోపణలు చేశాడు. 2025 ఛాంపియన్స్? ట్రోఫీ జట్టులో మిస్టరీ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్?కు చోటు దక్కకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. గతంలో అతడు మంచి ప్రదర్శనే చేసినా మేనేజ్?మెంట్ చాహల్?ను ఎందుకు పక్కన పెట్టిందో అర్థం అవ్వడం లేదని పేర్కొన్నాడు. బీసీసీఐ అతడి కెరీర్?ను క్లోజ్ చేసిందని అన్నాడు. ఈ మేరకు ఆకాశ్ తన యూట్యూబ్ ఛానెల్?లో తాజాగా వ్యాఖ్యానించాడు. 'యుజ్వేంద్ర చాహల్ కెరీర్ దాదాపు ముగిసిపోయింది. బీసీసీఐ అతడి ఫైల్‌ను క్లోజ్ చేసింది. అయితే ఇలా ఎందుకు



జరిగిందనేది అర్థం చేసుకోవడం కూడా కష్టమే. 2023 జనవరిలో చాహల్? ఆఖరిసారిగా వన్డే మ్యాచ్ ఆడాడు. అప్పుడు అతడి గణాంకాలు ఆకట్టుకునేలాగే ఉన్నాయి. నిలకడగా వికెట్లు తీస్తూనే ఉన్నాడు. అయినా జట్టు నుంచి తప్పించారు. అతడు టీమ్?కు దూరమై ఇప్పటికి దాదాపు రెండేళ్లవుతోంది. కానీ, అప్పట్నుంచి అతడికి అవకాశాలు మాత్రం ఇవ్వలేదు' అని ఆకాశ్ పేర్కొన్నాడు. కాగా, 2016లో చాహల్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 72 వన్డేల్లో 121, టీ20ల్లో 96 వికెట్లు పడగొట్టాడు. 2025 ఐపీఎల్? మెగా వేలంలో మాత్రం చాహల్ భారీ ధరకు అమ్ముడయ్యాడు. ఈ లెగ్ స్పిన్నర్?ను పంజాబ్ కింగ్స్? రూ.18 కోట్ల భారీ మొత్తానికి వేలంలో దక్కించుకుంది. 2013లో ఐపీఎల్?లోకి ఎంట్రీ ఇచ్చిన చాహల్ ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పటివరకూ 160 మ్యాచ్?ల్లో చాహల్ 205 వికెట్లు పడగొట్టాడు.

## స్పోర్ట్స్

## కపిల్ దేవ్ రికార్డ్‌పై కన్నేసిన షమీ!




టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీని అరుదైన ఘనత ఊరిస్తోంది. గాయంతో గత 15 నెలలుగా ఆటకు దూరంగా ఉన్న షమీ.. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా మరికాసేపట్లో (బుధవారం) ప్రారంభమయ్యే తొలి మ్యాచ్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. అయితే ఈ మ్యాచ్‌లో షమీ 2 వికెట్లు పడగొడితే అంతర్జాతీయ క్రికెట్‌లో 450 వికెట్ల మైలురాయి అందుకోనున్నాడు. ఈ ఘనత సాధించిన నాలుగో పేసర్ కపిల్ దేవ్ సరసన షమీ నిలవనున్నాడు. ఈ జాబితాలో కపిల్ దేవ్(687), జహీర్ ఖాన్(597), జవగల్ శ్రీనాథ్(551) మహమ్మద్ షమీ కన్నా ముందున్నారు. ఓవరాల్‌గా అనిల్ కుంబ్లే 401 మ్యాచ్‌ల్లో 953 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. రవిచంద్రన్ అశ్విన్ 287 మ్యాచ్‌ల్లో 765 వికెట్లతో రెండో స్థానంలో నిలిచాడు. హర్భజన్ సింగ్ 365 మ్యాచ్‌ల్లో 707 వికెట్లు, కపిల్ దేవ్ 356 మ్యాచ్‌ల్లో 687 వికెట్లు, రవీంద్ర జడేజా 351 మ్యాచ్‌ల్లో 597 వికెట్లు, జహీర్ ఖాన్ 351 మ్యాచ్‌ల్లో 597 వికెట్లతో, జవగళ్ శ్రీనాథ్ 296 మ్యాచ్‌ల్లో 551 వికెట్లు తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన మహమ్మద్ షమీ 4.12 ఎకానమీతో 448 వికెట్లు పడగొట్టాడు. ఇంగ్లండ్‌తో జరిగే తొలి టీ20లో రెండు వికెట్లు తీస్తే షమీ 450 వికెట్ల మైలురాయిని అందుకోనున్నాడు. చీలమండ, మోకాలి గాయాలతో షమీ గత 15 నెలలుగా భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో చివరిసారిగా అతను టీమిండియా తరఫున ఆడాడు. గాయం నుంచి కోలుకోవడానికి చాలా కష్టపడ్డానని షమీ తెలిపాడు. "బౌలింగ్ చేయడం, కారు డ్రైవింగ్ చేయడం లేదా గాలి పటం ఎగరేయడం.. ఏదైనా సరే చేయాలంటే ముందు మానసికంగా బలంగా ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి. అప్పుడే మనం ఏ పైనా చేయగలం. పరుగులు చేస్తూ, వికెట్లు తీసే సమయంలో ప్రతిఒక్కరూ మన చుట్టే ఉంటారు. కానీ అసలైన పరీక్ష అది కాదు. కష్ట సమయాల్లో మనతో ఎవరు ఉంటారనేది తెలుసుకోగలగాలి. దాదాపు ఏడాది కాలం పాటు నేను అదే చూశా. చాలా కష్టపడ్డాను. భయంగానే పరిగెత్తాను. ఇప్పుడు ఆ స్టేజ్ దాటేశాను. కఠినంగా శ్రమిస్తేనే.. ఫలితాలు గొప్పగా ఉంటాయి." అని షమీ అన్నాడు.




# వీరధీరసూరన్‌లో విక్రమ్ బిజీబిజీ

కోలీవుడ్ స్టార్ యాక్టర్ చియాన్ విక్రమ్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ స్టార్ హీరో నటిస్తున్న చిత్రాల్లో ఒకటి వీరధీరసూరన్. ఛియాన్ 62 ప్రాజెక్టుగా తెరకెక్కుతున్న ఈ మూవీకి చిత్త (చిన్నా) ఫేం ఎస్‌యూ అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎక్జయిటింగ్ అప్‌డేట్ అందించబోతున్నారంటూ యాక్టర్ కమ్ ప్రొడ్యూసర్ రియా ఓ సెల్ఫీ వీడియో షేర్ చేసింది. అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుదల తేదీయే అయి ఉంటుందని అంతా చర్చించుకుంటుండగా.. దీనిపై మరికొన్ని గంటల్లోనే క్లారిటీ రానుంది. క్యూట్ క్యూట్‌గా సాగుతున్న రియా సెల్ఫీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే లాంచ్ చేసిన వీరధీరసూరన్ టైటిల్ టీజర్ పక్కా యాక్షన్ ప్యాక్‌డ్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలియజేస్తుంది. ఈ చిత్రాన్ని ఏపీలో శ్రీలక్ష్మి మూవీస్, తెలంగాణలో ఎన్‌వీఆర్ బ్యానర్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మూవీలో కోలీవుడ్ భామ దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ఆ హీరోని కలవగానే ఫిదా అయ్యా.


మమితా బైజు.. ఈ ముద్దుగుమ్మ ఎంతో మంది కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్.. ఈ అమ్మడి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నామధ్య వచ్చిన మలయాళంలో బ్లాక్ బస్టర్ హిట్ ప్రేమలు ద్వారా తెలుగు తెరకు పరిచయమైంది మమితా బైజు. ఈ ముద్దుగుమ్మ 2017లో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. 'సర్వోపరి పాలక్కారన్' ఆమె మొదటి సినిమా. ఆ తర్వాత చాలా సినిమాల్లో మమితా నటించింది. కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు కూడా చేసింది. ఇక ప్రేమలు సినిమా ఈ చిన్నదాని క్రేజ్ ను పెంచేసింది.ప్రేమలు సినిమాలో మమిత బైజు క్యూట్ క్యూట్ నటనకు ఆడయన్స్ తో పాటు.. సెలబ్రిటీలు కూడా పడిపోయారు. మరీ ముఖ్యంగా రాజమౌళి సైతం ఫిదా అయ్యారు. అయితే ప్రేమలు సినిమా తర్వాత తెలుగులోనూ బిజీ అవుతుందని అంతా అనుకున్నారు కానీ అలా జరగలేదు. ప్రస్తుతం దళపతి విజయ్ తదుపరి చిత్రంలో మమితా బైజు నటిస్తుంది. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే మొదలైంది ఈ సినిమాలో పూజాహెగ్డే హీరోయిన్ గా చేస్తుంది. అలాగే మమిత ఈ సినిమాలో విజయ్ చెల్లిగా కనిపిస్తుందని అంటున్నారు. తాజాగా విజయ్ గురించి ఆమె ఇంట్రెస్టింగ్ కామెట్స్ చేసింది. విజయ్ సినిమాలో నటించడం తన కల అని చెప్పుకొచ్చింది. అలాగే విజయ్ ను మొదటి సారి కలిసినప్పుడు ఆయనను అలా చూస్తూ ఉండిపోయాను అని తెలిపింది ఈ భామ.




# ఓటీటీ వల్లనే సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి

## – అక్షయ్‌కుమార్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఓటీటీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. థియేటర్‌లో వచ్చే సినిమాలు ఓటీటీ (ఓవర్ ది టాప్)ల వలనే ఫ్లాప్ అవుతున్నాయని తెలిపాడు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్కై ఫోర్స్'. ఈ సినిమాతో వీర్ పహరియా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తుండగా.. సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. భారత దేశ మొదటి వైమానిక దాడి ఆధారంగా ఈ సినిమా రూపొందగా.. ఇందులో సారా అలీ ఖాన్, నిమ్రత్ కౌర్ కీలక పాత్రలు పోషించారు. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. ఇండియన్ సినిమా ప్రస్తుతం ఎందుకు ఇంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది?.. ఎందుకు సక్సెస్ రేట్ ఎందుకు ఇంత తక్కువగా ఉందని మీడియా అక్షయ్‌ని ప్రశ్నించగా.. అక్షయ్ సమాధానమిస్తూ.. ఓటీటీల వలనే సినిమాలు థియేటర్‌లో ఆడకుండా ఫ్లాప్ అవుతున్నాయని వెల్లడించాడు. నేను ఈ మధ్య కొంతమందిని కలిసినప్పుడు వారితో సినిమాల గురించి మాట్లాడాను. అయితే వారు సినిమాలు థియేటర్‌లో కాకుండా ఓటీటీలో చూస్తున్నాం అని చెబుతున్నారు. ఒక సినిమా బాక్సాఫీస్ దగ్గర రన్ అవ్వకుండా ఫ్లాప్ అవ్వడానికి ఇదే ముఖ్య కారణం. కరోనా వేవ్ తర్వాత కూడా ఓటీటీలకు అలవాటైన ప్రేక్షకులు ఇప్పుడు థియేటర్‌కి రావడం క్రమంగా తగ్గించారు. ఈ మధ్య ఈ అలవాటు బాగా పెరిగింది అని తెలిపాడు. ప్రేక్షకులు కూడా ఈ మధ్య సెలక్టివ్‌గా సినిమాలు చూస్తున్నారు. వారికి సినిమా నచ్చితేనే థియేటర్‌కి వెళుతున్నారు. లేకుంటే అదే సినిమాను ఓటీటీలో వచ్చే వరకు వెయిట్ చేసి చూస్తున్నారు అంటూ అక్షయ్ చెప్పుకోచ్చాడు.






# 'చావా' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్

## ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా..

బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రెస్టిజీయస్ ప్రాజెక్ట్ ఛావా నటుడు విక్కీ కౌశల్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. మహారాష్ట్ర యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ పెద్ద కుమారుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రాబోతుండగా.. రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమా వాలంటైన్స్ డే కానుకగా.. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి వరుస్ అప్‌డేట్‌లను ప్రకటిస్తున్నారు మేకర్స్. ఇప్పటికే శంభాజీ మహరాజ్ పాత్రలో విక్కీ కౌశల్ ఫస్ట్ లుక్‌తో పాటు అతడి భార్య ఏసు బాయి పాత్రలో రష్మిక ఫస్ట్ లుక్‌లను చిత్రబృందం విడుదల చేసింది.ఇప్పుడు తాజాగా ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. అక్షయ్ ఖన్నా ఈ సినిమాలో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో కనిపించబోతున్నాడు. మొఘల్ సామ్రాజ్యాన్ని అతి క్రూరంగా పాలించిన మొఘల్ షాహెన్‌షా ఔరంగజేబు! అంటూ అతడి పోస్టర్‌ను పంచుకుంది. మరోవైపు ఈ సినిమా ట్రైలర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు తెలిపింది. మడాక్ ఫిల్మ్స్ పతాకం పై దినేశ్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంకు ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492